# రైతులకు కొత్త రుణాలు



యాలాల్ మండల కేంద్రంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి

**ఇప్పటికే రూ. 5కోట్ల రుణమాఫీ**
**1387 మంది రైతులకు ఊరట**
**నవాంద్గి సహకార సంఘం**
**చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి**

బషీరాబాద్, సెప్టెంబర్ 30 : సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం అనేక నిధులను అందిస్తుందని నవాంద్గి సహకార సంఘం చైర్మన్ అల్లాపూరం వెంకట్‌రాంరెడ్డి అన్నారు. శనివారం సహకార కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి గాను సంఘం రూ. 80లక్షల లాభాల్లో ఉందన్నారు. సహకార సంఘం కింద రుణాలు తీసుకున్న 1387 రైతులకు చెందిన రూ. 5కోట్ల రుణాలు మాఫీ కావడం జరిగిందని, అందులో 696 మంది రైతులకు సంబంధించి రూ. 2కోట్లు వచ్చాయని, వారికి కొత్త రుణాలు అందించడం జరుగుతుందన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబోతున్న పెట్రోల్ బంక్‌కు త్వరలో భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. రూ. 2కోట్లతో నిర్మిస్తున్న గోదాం, రైస్ మిల్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, గోదాం, రైస్ మిల్ కోసం మరో ఎకరం స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు విన్నవించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కార్యాలయ ఆవరణలో వేర్‌హౌస్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గోపాల్, సీఈవో బందప్ప, రైతులు పాల్గొన్నారు.

**రుణమాఫీలో జిల్లా ఆదర్శం**

యాలాల్ : వికారాబాద్ జిల్లాలో రుణమాఫీలో ఆదర్శంగా నిలిచిందని పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 2 కోట్ల 50 లక్షలతో దౌలాపూర్‌లో రైస్ మిల్‌తో పాటు గోదాం, రూ.30 లక్షలతో నూతన సమావేశ మందిరాన్ని నిర్మించనున్నామన్నారు. మండల వ్యాప్తంగా 340 మంది రుణమాఫీతో లబ్ధి పొందారన్నారు. రూ 17కోట్ల టర్నోవర్‌తో లాభాల బాటలో దూసుకుపోతుందన్నారు. యూ రియా, డీఏపీ, 20–20 లను ఎరువులను సకాలంలో అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. రూ.2 కోట్ల 24 లక్షల రుణమాఫీ తమ పీఏసీఎస్ ద్వారా చేసినట్లు తెలిపారు. దీర్ఘకాలిక రుణాలను రైతులు చెల్లించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, సంస్థ డైరెక్టర్లు అధికారులు పాల్గొన్నారు.



బషీరాబాద్ : సమావేశంలో మాట్లాడుతున్న సీఈవో



ఆరోగ్య రథ సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

# ఆరోగ్య సంరక్షణే ధ్యేయం

నవాబుపేట, సెప్టెంబర్ 30 : మండల పరిధిలోని యెల్లకొండ గ్రామంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు రావుగారి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో 'చేవెళ్ల ఆరోగ్య రథ' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఎంపీ రంజిత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. తన నియోజకవర్గ ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఉచితంగా మందులు, టెస్ట్‌లు, వైద్యం అందిస్తున్న రంజిత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆరోగ్య రథ సేవలతో సుడిగాలి పర్యటన చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బందిని ఎమ్మెల్యే యాదయ్య అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, పీఏసీఎస్ రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, సర్పంచులు వెంకట్‌రెడ్డి, అజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేతలు ఆనంద్‌రెడ్డి, ప్రకాశ్, వార్డుమెంబర్లు ప్రభాకర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పౌరహక్కులకు భంగం కలిగించొద్దు



బొంరాస్‌పేట : నాందార్‌పూర్‌లో జరిగిన పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్సై శంకర్

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 30 : మండలంలోని నాందార్‌పూర్ గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై శంకర్ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన హక్కుల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా పౌరహక్కులకు భంగం కలిగే విధంగా ఎవ్వరూ వ్యవహరించరాదని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవిచారి, ప్రజలు పాల్గొన్నారు.

**వ్యక్తులందరూ సమానమే..**

పెద్దేముల్ : భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరూ సమానమని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజూరెడ్డి, ఎస్ఐ ఎం.కాశీనాథ్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని హన్మాపూర్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి గ్రామస్తులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుటివారి హక్కులను హరించకుండా, ఎవరు కూడా ప్రాంతీయ, వ్యక్తుల మధ్య అసమానతలను చూపరాదన్నారు. రాజ్యాంగంలో వ్యక్తుల సంపూర్ణ అభివృద్ధి కోసమే రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని, వ్యక్తుల సర్వతోముఖాభివృద్ధికి ఆత్మగౌరవం ముఖ్యమైనదన్నారు. కులాంతర వివాహాలకు ప్రభుత్వం రూ.2 లక్షల 50 వేల రూపాయలను అందిస్తున్నదని, ప్రభుత్వ పథకాలను ఎస్సీ, ఎస్టీ కులాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు గ్రామంలో అగ్రకులాల ఆధిపత్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజేశ్వర్, ఎస్ఐ ఎం.కాశీనాథ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, బీఆర్ఎస్ యువ నాయకుడు పసుల వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేడు పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

**మంత్రుల పర్యటనను**
**విజయవంతం చేయండి**
**ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్**



ఆమనగల్లు, సెప్టెంబర్ 30 : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, పౌర సంబంధాలు మరియు గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ పోతుగంటి రాములు నియోజకవర్గంలో నేడు పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయుటకు విచ్చేయుచున్నట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో నూతనంగా మంజూరైన 50 పడకల ప్రభుత్వ దవాఖాన నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన తదనంతరం అభివృద్ధి పనుల కోసం టీయూఎఫ్ఐడీసీ ద్వారా విడుదలైన రూ.25 కోట్లకు సంబంధించిన పైలాన్ ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మించిన మాడల్ డిజిటల్ గ్రంథాలయాన్ని ప్రారంభించి రోడ్ షో మీటింగ్ నిర్వహిస్తారన్నారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలో నూతనంగా నిర్మించిన సింగిల్ విండో కార్యాలయాన్ని ప్రారంభించి, టీయూఎఫ్ఐడీసీ పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే వివరించారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలో భారీ బహిరంగ సభ ఉంటుంది. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అంతకుముందే పట్టణంలో సమస్యలు పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకుపోయి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట జడ్పీటీసీ అనురాధ, మైనార్టీ విభాగం జిల్లా నాయకుడు సయ్యద్ ఖలీల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కమఠం వెంకటేశ్, ఎనుమల్ల రమేశ్, రమేశ్ నాయక్, రమేశ్ యువజన విభాగం నాయకులు కిరణ్, ప్రసాద్, విక్రమ్, నవీన్, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పరిగి టౌన్, సెప్టెంబర్ 30 : పరిగి మండలంలో ఎన్నికైన 24 మంది ఉత్తమ ఉపాధ్యాయులను శనివారం బృందావన్‌గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కరణం అరవింద్‌రావు మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సన్మానించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ హరిప్రియారెడ్డి, ఎంఈవో హరిశ్చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.



# సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్ల నివారణ

**వ్యవసాయ శాఖ జిల్లా**
**అధికారిణి గీతారెడ్డి**



కేశంపేటలో పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏవో గీతారెడ్డి

కేశంపేట, సెప్టెంబర్ 30 : పత్తి, మొక్కజొన్న పంటల్లో తెగుళ్ల నివారణకు రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారిణి గీతారెడ్డి సూచించారు. కేశంపేట మండల కేంద్రంలోని పలువురి రైతుల పత్తి, మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించారు. పంటలకు పలు రకాల తెగుళ్లు వస్తున్నాయని తెలిపారు. వాటి నివారణకు వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులను పిచికారీ చేసి పంటలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

**ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి**

ఇబ్రహీంపట్నంరూరల్, సెప్టెంబర్ 30 : విద్యార్థులు డ్రగ్స్ ఉచ్చులో చిక్కుకుంటే జీవితం అంధకారంగా మారుతుందని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ నిర్మూలనపై న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాల్సిన విద్యార్థులు చెడు వ్యసనాల కారణంగా జీవితాలను నాశనం చేసుకోవడం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల జీవితాలను డ్రగ్స్ చిదిమేస్తున్నదని విచారం వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన కేసుల్లో ఇరుక్కుంటే విద్యార్థులు జైలు గోడల మధ్య జీవితాన్ని గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కళాశాల బహిష్కరణతో పాటు రెండేండ్ల జైలుశిక్షతో పాటు రూ.10వేల జరిమానా కూడా విధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నాగరాజు, న్యాయవాది రవి, ప్రిన్సిపల్ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



**తొగుటవీర క్షత్రీయ సంఘం**

## నూతన కమిటీ ఏకగ్రీవం

కొడంగల్, సెప్టెంబర్ 30 : పట్టణంలోని శ్రీ చౌడేశ్వరీ ఆలయంలో తొగుటవీర క్షత్రీయ సంఘం నూతన కమిటీ ఎన్నిక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో కొడంగల్ తాలూకా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలుక అధ్యక్షుడిగా దేవరకొండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా అంజిలయ్య, కోశాధికారి రతీశ్, గౌరవ అధ్యక్షుడు రుమాండ్ల నర్సింహులుతో పాటు ప్రచార కార్యదర్శి, సలహాదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా తాలుకా అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం ఐక్యతకు, బలోపేతానికి కృషి చేస్తూ.. సేవా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.